


# కోరికలే గుర్రాలైతే....

- ప్రజ్వల

"వరకట్నం తీసుకోవటం మా ఇంటా వంటా లేని ఆచారం" అని కట్నం తీసుకోకుండా వసంతను పెళ్ళి చేసుకున్నాడు వరప్రసాదరావు. భార్య వద్దంటున్నా మేనరికాన్ని వదిలిపెట్టి ఇతనికే తన కూతురినిచ్చి పెళ్ళి చేశాడు రాఘవరావు. ఇంత మంచి అల్లుడు దొరికినందుకు పెళ్ళి పందిట్లో అందరూ అతని అదృష్టాన్ని, అసూయతో ప్రశంసించారు.

పెళ్ళయి సరిగ్గా నాలుగు నెలలు కూడా కాలేదు. అప్పుడే అమ్మాయి చేత ఉత్తరం రాయించాడు. ఛీ. ఛీ. వీళ్ళా మనుషులేనా? డిగ్రీల వెనకాల తమ సంస్కారాలు దాచుకుని ఎదుటివారిని దోచుకునే రకం! ఎందుకో అంతవరకూ అల్లుడి మీద ఉన్న గౌరవం పోయి అసహ్యంచుకున్నాడు రాఘవరావు. రాఘవరావు, కాళ్ళు కడిగి కన్యాదానం చేసిన రోజు అల్లుణ్ణి చూసి ఎంతో గర్వపడ్డాడు. కానీ ఈ రోజు అటువంటివాడి కాళ్లు నలుగురిలో పట్టుకున్నందుకు కలవరపడ్డాడు. కృత్రిమ మనుషులు... కృత్రిమ జీవితాలు....

"ఎక్కడినుంచండీ ఉత్తరం? ఎవరు రాశారు?" వంటింటి లోపల నుంచి బయటికి వచ్చిన శాంతమ్మ భర్తను అడిగింది.

"ఇంకెవరి దగ్గరి నుంచీ... నీ కూతురి దగ్గరినుంచే.... వాడే... అల్లుడే రాయించాడు. చదువుకో" అని చేతిలోని ఆ ఇన్‌లాండ్ లెటర్‌ను అక్కడున్న టీపాయ్ మీద పెట్టాడు రాఘవరావు.

"ఏమిటిది అల్లుడిగార్ని వాడు వీడు అని ఏకవచనంలో సంబోధిస్తున్నారు? ఎవరన్నా వింటే పరువు పోతుంది. కాస్త మెల్లిగా మాట్లాడండి..." భర్తను కొంచెం అదుపులోకి తేవటానికి ప్రయత్నించింది శాంతమ్మ. తన తమ్ముడితో కూతురికి పెళ్ళి చెయ్యలేకపోయిన బాధ ఉన్నా... అల్లుడ్నీ, అతని ఆప్యాయతనీ, ఆదర్శాలనూ చూసిన శాంతమ్మ ఇప్పుడు ఆ అల్లుడంటే ఇష్టం ఏర్పరచుకుంది.

టీపాయ్ మీది ఉత్తరం తెరిచి చదివింది శాతమ్మ. సారాంశం ఇది.

'అల్లుడిగారి ఊరైన వరంగల్లులో ఎండలెక్కువగా ఉన్నాయి. పాలు తొందరగా విరిగిపోతున్నాయి. కూరగాయలు వాడిపోతున్నాయి. వెంటనే ఒక ఫ్రిజ్ కావలెను. అమ్మకు మా నమస్కారములు.

ఇట్లు

నీ ప్రియమైన కూతురు...

వసంత'

ఉత్తరం చదివిన శాంతమ్మ చిరునవ్వు నవ్వుతూ, "న్యాయమైనన కోరికే. అసలు అల్లుడు కానీ కట్నం, పైసా లాంఛనాలు తీసుకోకుండా మన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. అతనికి ఆమాత్రం ఒక ఫ్రిజ్ కొనిస్తే మన సొమ్మేం తరగదు. అదేదో వెంటనే ఏర్పాటు చెయ్యండి" అని మంజూరు చేసింది ఆ మహాతల్లి.

"అది కాగోయ్ ఆ మాత్రం దానికి ఆనాడు అంత పోజులెందుకు కొట్టాడు? 'నాకున్న ఆస్థి నా చదువూ, లెక్చరర్ ఉద్యోగం, నా మోపెడ్ బండి. నా భార్యకు నేను తృప్తిగా రోజుకు ఎన్ని సార్లయినా భోజనం పెట్టగలను...' అదీ ఇదీ అని ఆ బోడి లెక్చర్లు ఎందుకంటా?"

"ఏవండోయ్... ఒక్కసారి... ఒక్కసారి కొంచెం నలభై సంవత్సరాలు వెనక్కు వెళదామా? మా నాన్న మన పెళ్ళి ఎంత గొప్పగా చేశాడు. ఐదు రోజుల పెళ్ళి, ఆడబడుచుల కట్నాలు, ఇకపోతే తర్వాత తమకు సమర్పించుకున్నదీ..... ఆపైన మీ అమ్మా నాన్నలకు ముట్ట చెప్పవలసిందీ.... అంతా అయినా అలక పాన్పు మీద బోడి అలారం టైం పీసు ఇవ్వలేదని ఎంత రాద్ధాంతం చేశారు మీరు. కాస్త సింహావలోకనం చేసుకుని చూడండి తప్పు లేదు." మెత్తగానే అన్నా ఆమె మాటల్లో దెప్పి పొడుపు కనిపించింది రాఘవ రావుకు.

ఇక ఆ టాపిక్‌ని అలా పెంచితే తన ఇమేజ్ డామేజ్ అయ్యే ప్రమాదం ఉందని గ్రహించి రాఘవరావు వెంటనే బ్యాంక్‌కు వెళ్ళి ఓ డి.డి తీసి కూతురికి పంపాడు.

* * * * *

ఆఫీసు నుండి ఆరోజు ఇంటికి అలస్యంగా వచ్చాడు ఆనందరావు. అతని మొఖంలో అలసటకన్న అసహనం ఎక్కువగా కనపడుతున్నది, అతని భార్య సావిత్రికి. బాత్‌రూం నించి బయటికొస్తున్న భర్తకు ప్లేటులో పకోడీలు కప్పులో కాఫీతో ఎదురెళ్ళి స్వాగతం పలికింది.

"ఇవాళ శ్రీవారెందుకో సీరియస్‌గా ఉన్నారు?" చేతిలోనివి అతనికి అందించింది. అవి అందుకొని అక్కడున్న టేబిల్ మీద పెట్టాడు ఆనందరావు. పొద్దుటినుంచి మూడు నాలుగుసార్లు చదివి విసిగి పోయిన ఆ ఇన్‌లాండ్ లెటర్ జేబులోంచి తీసి భార్యకిచ్చాడు.

ప్రియమైన పెద్దన్నయ్యకు.

మీ బావగారు కాలేజీకి వెళ్ళాక నాకు భలే బోరు కొడుతున్నది. ఇక్కడ వరంగల్లులో కేబుల్ టీవీలు మొదలయినాయి. అన్ని ఛానల్స్ వస్తున్నాయి. దయచేసి నాకొక కలర్ టీ.వీ. కొనివ్వు.దయచేసి ఈ విషయం మన అమ్మా నాన్నకు చిన్నన్నయ్యకు తెలీనీకు. మావారి గురించి ఏమైనా అనుకుంటారు. తప్పక అరేంజ్ చేస్తావు కదూ? వదినకు నా నమస్కారాలు.

ఇట్లు
నీ ప్రియమైన చెల్లి
వసంత.

"ఇంకేం రక్తసంబంధం సినిమాలో సావిత్రి అడిగితే ఎన్టీఆర్ కాదంటాడా? అలాగే ఆ చెల్లెలు అడగటం ఈ అన్న లేదనటం కూడానా? ఎలాగూ బోనస్ రాబోతున్నదిగదా... దాన్ని ఇలాగైనా సద్వినియోగం చెయ్యండి. దేవుడి దయవల్ల మనకింత ఉంది. పాపం మీ చెల్లెలికే....."


"కట్నం కానుకలు వద్దనగానే బోల్తా పడ్డారు మా అమ్మా నాన్నలు. అతడేదో ఒరగ బెడతాడనుకుంటే ఇప్పుడు చెల్లెల్ని అడ్డం పెట్టుకుని కలర్ టీ.వీ.కి టెండరు పెట్టాడు. వీళ్ళు మనుషులేనా? చెప్పేదొకటి చేసేదొకటి."

"ఇదుగో అదే....... అదే.... అనవసరంగా నోరు పారేసుకోకండి. ఆ మాత్రం వాళ్ళు అడగకూడదా? మీరు చెయ్యకూడదా? అయినా ఆయనకి టీ.వీ కావాలని ఉంటే ఆ రోజే మిమ్మల్ని పెళ్ళికి ముందే నిలేసి అడిగుండవచ్చు గదా? ఎందుకడగ లేదూ... మంచివాడు కాబట్టి..."

"నాన్సెన్స్.... ఆ రోజు వాళ్ళ ఊళ్లో కేబుల్ టీ.వీలు లేవు. ఇప్పుడవన్నీ వచ్చాయి కాబట్టి వెంటనే కావాలి. నా చెల్లెలికి ఇంట్లో ఒంటరిగా బోరు కొట్టడం ఒకసాకు. వీళ్ళంతా లెక్చెరర్లు... ఇంక వీళ్ళు పిల్లలకేం చదువు చెప్పి ఏడుస్తారు?"

"ఇదుగో మళ్ళీ మాటలు పారేసుకుంటున్నారు. మీవల్ల కాదంటే చెప్పండి. ఆ డబ్బేదో నేనే ఏర్పాటు చేస్తా. మన పెళ్ళిలో మీ కట్నానికీ, లాంఛనాలకూ, ఆడబడుచు కట్నానికీ, ఎంతో ఖర్చు పెట్టారు మా డాడీ. నా పేరు మీద రెండు లక్షలు ఫిక్సెడ్ డిపాజిట్ చేసి .ఈ ఇల్లు కూడా కొనిచ్చాడు. పాపం మీరు మీ చెల్లెలి కింతవరకు ఏంచేశారు? ఆ టీ.వీ. అయినా కొనివ్వండి మహాశయా....".

"అదికాదు సావిత్రి..... ఈనెల నాకు బోనస్ వస్తుందని మా బావకు

బాగా తెలుసు. అందుకే మా చెల్లెలికి ప్రెషర్ ఇచ్చి ఈ ఉత్తరం రాయించాడు. కలర్ టీ.వీ. కొనివ్వడం పెద్ద ప్రశ్న కాదు. ఈ డొంక తిరుగుడు వ్యవహారమే నాకు నచ్చలా. రేపే వెళ్ళి డి.డి. తీసి పంపిస్తాలే."

"అదీ మా మంచి శ్రీవారంటే" అని సావిత్రి కాంప్లిమెంట్స్ విని ఆనందంతో పరవశించిపోయాడు ఆనందరావు.

* * * * *

వసంత ఇంటికొచ్చి వారం రోజులయినా అందరితోనూ ముభావంగానే ఉంది గానీ ఇది వరకటిలా కలిసిపోవటల్లా. ఏదో బాధ ఆమెను లోలోపల దహిస్తున్నట్లు ఫీల్ అవుతున్నదని ఆమె తల్లిదండ్రులు, అన్నయ్యలు, వదినలు గ్రహించటానికి ఎక్కువ రోజులు పట్టలేదు.

విడి సంసారం, మొగుడు పెళ్ళాలన్న తర్వాత ఇవి సహజం అని మొదట్లో చూసీ చూడనట్లున్న రాఘవరావు ఇక లాభం లేదని రంగంలోకి దిగాడు.

"అదికాదమ్మా పండక్కి నాతో తప్పక వస్తానన్న అల్లుడుగారు ఇప్పుడు ఎందుకు రారట? నిన్ను మాత్రం ఇలా విడిగా పంపిస్తే ఏవిటి అర్థం? ఏదైనా సమస్యలుంటే నేరుగా వచ్చి పరిష్కరించుకోవాలి గానీ ఇలా ఆడవారి మీద, అత్తమామల మీదా... ఈ వరస నాకేం నచ్చలేదమ్మా"

"అతనికి మేం ఏం తక్కువ చేశామనీ? పెళ్ళిలో కట్నం వద్దన్నాడంటే ఎంతో సంతోషించాము. దానికి బదులుగా ఈ రెండు సంవత్సరాలలో ఏదో ఒక సాకుతో టీ.వీ. అనీ, ఫ్రిజ్ అనీ, ఏ.సి. అనీ మా దగ్గరి నుంచి ఎంతో గుంజాడు. పైగా నాకు తెలీకుండా మీ అమ్మ ఆమెకు తెలీకుండా నేనూ, మాకు తెలీకుండా మీ అన్నలూ, వదినలూ నీకు బాగానే పైకం ముట్ట చెప్పారు. ఇంకా ఏం కావాలిట అతనికి?" కొంచెం ఉద్రేకంతో అన్నాడు రాఘవరావు.

"అదికాదు నాన్నా. మొన్న మీరు మన బెజవాడ ఇల్లు అమ్మబోతున్నాం, దానికి త్వరలో నన్నూ, అన్నయ్యల్ని వచ్చి సంతకం పెట్టమని రాశారుగదా. దాని విలువ దాదాపు ఇవాళ పదిహేను లక్షలట. అందులో నాకూ వాటా వస్తుందిట. కానీ అలా అడిగితే బాగుండదని సంతకం చేసే ముందు ఓ యాభై వేలు కాష్‌గా మీ దగ్గర నుంచి తీసుకోమన్నారు." భయం భయంగా తండ్రి వైపు   చూసింది వసంత.

"ఓస్... ఇంతేనా? దానికి ఇంత ఆలోచించాలా తల్లీ. తప్పకుండా. నీవు కాక ఇంకెవరున్నారు మాకు. ఇంటి ఆడబడుచుకు పసుపు కుంకం క్రింద ఇచ్చామనుకుంటాం. దానికి పోయి అల్లుడుగారు పండక్కి రాకపోవటం ఏం బాగులేదమ్మా ఆయనకి ఇవాళే ఉత్తరం రాస్తాను." భారం తీరిన సంతోషంతో సోఫా నుంచి లేచాడు రాఘవరావు అందరూ తృప్తిగా ఊపిరి వదిలారు.

వారం రోజులుగా కూతురు సాధించిన మూగ నోముకు ఓ ఫలితం దక్కిందని సంతోషపడ్డారు ఆ కుటుంబ సభ్యులు.

"అది కాదు నాన్నా..." మళ్ళీ మొదలు పెట్టింది వసంత."ఆయన మోపెడ్ పాతదయిందిగదా దాని మీద రోజూ కాలేజీ కెళ్ళడానికి ఆయనకి నామోషీగా ఉందిట. అందుకని ఓ మారుతీ కారు కావాలంటున్నారు. త్వరలో ఆయన ప్రొఫెసర్‌కూడా కాబోతున్నారు. ఆ విషయం మీతో స్వయంగా చెప్పలేక నన్ను పంపించారు. బహుశ ఆ కారు కొనకపోతే నేను ఆ ఇంటికి తిరిగివెళ్ళలేనేమో....." అంతటి చలాకీ పిల్ల కళ్ళలో మొదటిసారి కన్నీరును చూశారు ఆ కుటుంబ సభ్యులు.

అందరూ వసంత మాటలను ఆశ్చర్యంగా వింటున్నారు. ఏదో సినిమాలో అత్తమామలు కోడంత్రికం పెట్టినట్లు ఈ అల్లుడు ఒక్కడే అమ్మాయిని అడ్డం పెట్టుకుని ఇంత అఘాయిత్యానికి పాలు పడతాడా? అంతా కలికాలం. రాఘవరావు బాధ పడ్డాడు. అన్నల ఆగ్రహానికి అంతులేదు. "కట్నం లేకుండా పెళ్ళి అని ఆరోజు సంబరపడ్డారే.... ఇవాళేం అయిందో చూడండి. ఇది ఇంతటితో ఆగదు ఈ గొంతెమ్మ కోరికల కొక అంతుండదు. హాయిగా మన చిన్న మామయ్యకిచ్చి దీని పెళ్ళి చేసుంటే ఏ ప్రాబ్లం లేకుండా ఉండేది."

"సరే అమ్మా అలాగే కానిద్దాం. రేపే వెళ్ళి కారు బుక్ చేస్తా. ఈ రోజే అల్లుడిగార్ని సమాధాన పరిచి పండక్కి రమ్మని ఉత్తరం రాయి" అని ఆప్యాయంగా వసంత తలను చేత్తో నిమిరాడు. అందరూ తమ తమ గదుల లోకి వెళ్ళారు.

రాఘవరావు చెప్పిన మాటల్ని, చేతల్నీ విన్నారూ, చూశారేగానీ ఆడపిల్లని కన్న తండ్రిగా ఆ సమయంలో అతని హృదయం ఎంత క్షోభ చెందిందో ఆ ఇంటివారు ఎవరూ గ్రహించలేదు. కానీ శాంతమ్మ మౌనంగా తన భర్త హృదయాగ్ని ఘోషను వింటూనే ఉంది. ఆ మౌనాన్ని ఛేదిస్తూ.....

"సార్ పోస్ట్." అంటూ వచ్చాడు పోస్ట్‌మేన్.

పోస్ట్‌మేన్ ఇచ్చిన ఉత్తరాన్ని అటూ ఇటూ తిప్పి చూస్తున్నాడు రాఘవరావు.

"ఎవరి దగ్గరి నుంచండీ ఉత్తరం?" అడిగింది భార్య శాంతమ్మ

"ఇంకెవరు? ఆ బ్లాక్ మెయిలర్ దగ్గరినుంచే... అదే నీ అల్లుడు."

"తెరిచి చదవండి" భార్య ప్రార్ధనా పూర్వకంగా అర్థరిచ్చింది.

"అదీ... రాసింది నా పేరుకే అయినా అమ్మాయి ఇక్కడే ఉంది కాబట్టి దాన్నే చదువుకోమంటా. మధ్యలో మనకెందుకు లేనిపోని నిందలు." అన్నాడు అసహనంగా రాఘవరావు.

"అది అల్లుడు మీకు రాసిన ఉత్తరం. అసలేం రాశాడో చదవండి."

అయిష్టంగానే కవరు తెరిచాడు రాఘవరావు.

"పూజ్యులయిన మామగారి పాదచరణాలకు నమస్కారములు." "ఈ దొంగ నమస్కారాలూ, నక్కవినయాలకేం తక్కువలేదు." కామెంట్ చేశాడు రాఘవరావు.

"అక్కడ అందరూ క్షేమం అని తలుస్తాను. వసంతను చిన్నప్పటి నుంచి అతి గారాబంగా పెంచారనుకుంటాను. ప్రతి చిన్న విషయాన్నీ గోరంతని కొండంతలు చేసి నాలోని సహనాన్ని పరీక్షిస్తున్నది. మీకు ఇదివరకే చెప్పాను నాకున్న ఆస్థి నా చదువు, సంస్కారం, ఉద్యోగం, నా మోపెడ్. కానీ అవి మాత్రం మీ కూతురికి సరిపోలేదు. అనవసరంగా ఇరుగు పొరుగు వారితో పోటీపడి. టీ.వీ, ఫ్రిజ్, ఏ.సి. ఇలా ఎన్నో అనవసరపు సామాన్లు కొని దుబారా ఖర్చులు చేసింది.

ఆమె మీది అమిత ప్రేమతో నాకూ తెలియకుండా మీరు ఆమెకు డబ్బు పంపి ఆమెను పాడుచేశారు. నన్ను అవమానపరిచారు. నాకు తెలియకుండా ఆమె ఈ రెండు సంవత్సరాలలో ఇక్కడ దాదాపు నలభై యాభై వేలు అప్పు చేసిందని నాకూ ఈ మధ్యే తెలిసింది. ఇప్పుడు వసంత ఇక్కడ లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్. ఆ ఎలక్షన్ల కెంత ఖర్చు పెట్టిందో ఇంకా లెక్క తెలీదు. మొన్ననే ప్రావిడెంట్ ఫండ్ లోన్ వేసి ఆమె చేసిన అప్పులు తీర్చేశాను.

అన్నిటికన్నా దారుణమయిన విషయం. మొన్న లేడీస్ క్లబ్‌లో మా ప్రిన్స్‌పాల్‌గారి భార్య అంబాసిడర్ కారులో వస్తే నెలరోజుల్లో తాను మారుతీ కారు కొంటానని అందరి ముందూ సవాలు చేసిందిట. ఆమెలోని కాంప్లెక్స్ ఆమెనొక మానసిక రోగిగా మారుస్తుందేమోనని నా భయం.

ఒకవేళ తను ఏదైనా సాకుతో మిమ్మల్ని కారు గురించి అడిగితే మంచి మాటలు చెప్పి పండగ పూర్తి కాగానే ఊరికి పంపించండి. నాకున్న ఆస్థి నా సంస్కారం. దాన్ని మీ డబ్బుతోనూ, మీ అమ్మాయి పట్ల అర్థం లేని గారాబంతోనూ దెబ్బతీయకండి. అత్తగారికి నమస్కారములు. అందరికీ నా పండగ శుభాకాంక్షలు.

ఇట్లు
మీ పుత్రసమానమైన అల్లుడు.
వరప్రసాద్.

షాక్ తిన్న ముఖంతో ఉత్తరాన్ని భార్యకిచ్చాడు రాఘవరావు. ❖